వసతి గృహంలో సమస్యల తిష్ట



హాస్టల్ గదుల్లో దిగబడిపోయిన ఫ్లోరింగ్



గోడలు నానిపోయి శిథిలావస్థకు చేరిన డైనింగ్ హాలు

- శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం
- భయాందోళనలో విద్యార్థినులు
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం

గణపవరం : గణపవరంలోని ఎస్సీ బాలికల వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. భవనాలు శిథిలావస్థకు చేరి ఏ క్షణాన కూలుతాయో అన్నట్లుగా తయారయ్యాయి. హాస్టల్ భవనంలో విద్యార్థినులు ఉండే గదుల్లో ఫ్లోరింగ్ పాడై, నేల దిగబడి పోవడంతో ఆ గదులు ఖాళీ చేశారు. హాస్టల్ భవనం శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం నీరు ధారగా కారడంతో గదులతోపాటు గోడలు కూడా నానిపోయి బీటలు వారుతున్నాయి. డైనింగ్ హాలు కూడా పాడై గోడలు బీటలు వారాయి. శ్లాబు నుంచి నీరు కారడంతో గోడలు నానిపోయి భవనం పాడైపోయింది. హాస్టల్‌లో మరుగుదొడ్లు కూడా పూర్తిగా పాడైపోవడంతో ఇటీవల వాటిని పునర్నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. నీళ్ల ట్యాంకు కూడా పాడయిపోవడంతో ప్లాస్టిక్ డ్రమ్ ఏర్పాటు చేసినా ఫలితం లేదు.

విష సర్పాల సంచారం

హాస్టల్ చుట్టూ పిచ్చి మొక్కలు, పచ్చగడ్డి పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు, తేళ్లు వంటివి సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థినులు చీకటి పడితే బయటకు రావడానికి భయపడుతున్నారు. హాస్టల్ అసౌకర్యాలకు కేంద్రంగా మారిపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించడానికి వెనకడుగువేస్తున్నారు. గణపవరం, నిడమర్రు మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు ఈ హాస్టల్ అందుబాటులో ఉండేది. గతంలో ఈ హాస్టల్‌లో సుమారు 150 మంది వరకూ విద్యార్థినులు ఉండేవారు. రానురాను విద్యార్థినుల సంఖ్య తగ్గిపోతూ ప్రస్తుతం 40 మంది బాలికలకే పరిమితమైంది. తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో చేర్పించడానికి వచ్చి హాస్టల్ దుస్థితిచూసి తిరుగుముఖం పడుతున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో ఉన్న పిల్లలను కూడా కొందరు తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకుపోవడానికి చూస్తున్నారు. దీనిపై హాస్టల్ వార్డెన్ స్వర్ణలతను వివరణ కోరగా హాస్టల్ పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే హాస్టల్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించడానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం



శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉన్న వార్డెన్ భవనం

5కే రన్‌లో వ్యాయామ కళాశాల విజయభేరి



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నతానియేలు

దెందులూరు: ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసం ఏలూరులో నిర్వహించిన 5కే రన్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విజయభేరి మోగించింది. బీపీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న రెడ్డి నాగమణి, కె.రమ్యదుర్గాభవానికి మొదటి, ద్వితీయ స్థానాలు గెలుపొందారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విజేతలకు అందజేశారు. విజేతలను ప్రిన్సిపాల్ నతానియేలు, వైస్ ప్రిన్సిపాల్ వై.పోల్‌రెడ్డి, అధ్యాపకులు దిలీప్‌కుమార్, సిబ్బంది అభినందించారు.

సూర్యఘర్ యోజనను వినియోగించుకోవాలి

ఉంగుటూరు: సూర్యఘర్ యోజనలో కేంద్ర ప్రభుత్వం రాయితీతో సోలార్ విధానంలో అమర్చే ప్లేట్లను వినియోగించకోవాలని ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ ప్లాంట్లను, సోలార్ ప్లేట్లను బిగించడానికి అనువుగా ఉన్న ప్రతి ఇంటికి వేయించుకోవాలని తెలిపారు. బీసీలకు 80 శాతం రాయితీతో పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న పెదవేగి సీఐ రాజశేఖర్

పెదపాడు: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో శుక్రవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం వేగంగా నడపరాదని ప్రాణాలు కాపాడుకోవాలని చెప్పారు. ప్రపంచానికి నువ్వు ఒక్కడివే కాకపోయినా నీ ఇంటికి నువ్వే పెద్ద దిక్కు అనే భావన ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

సత్యసాయి ఆలయానికి చిత్రపటం అందజేత



సత్యసాయి చిత్రపటాన్ని అందజేస్తున్న సత్యనారాయణ

ఉంగుటూరు: ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతున్న కైకరం తూర్పు వీధిలోని కాళింగ రామాలయానికి సత్యసాయి సేవా సమితి ఉంగుటూరు సబ్‌జోన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ శుక్రవారం సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు. సుందర సీతారామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు చిత్ర పటాన్ని అందుకుని ఆలయంలో అమర్చారు. దాసరి సత్యనారాయణకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభం



దసరా ఉత్సవాలకు సిద్ధమవుతున్న అమ్మవారి ఆలయం

దెందులూరు: నియోజవర్గంలో విశిష్ట ఆలయంగా పూజలందుకుంటున్న గోపన్నపాలెం కనకదుర్గా దేవి ఆలయంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేది వరకు భక్తి శ్రద్ధలతో దసరా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఇప్పటికే ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

నవసమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీ మహేష్, ఉంగుటూరు ఎమ్మెల్యే

భీమడోలు: నవ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. 31వ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పూళ్ల మాజీ సర్పంచ్, స్వర్గీయ పుప్పాల మోహన సీతారామయ్య ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పుప్పాల శ్రీనివాస్, పుప్పాల హరీష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలులో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా హాజరైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులు పాల్గొని ప్రసంగించారు. డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, ఏ.భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

వేలేరుపాడు: వైఎస్సార్‌సీపీ వేలేరుపాడు మండల కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా గుడ్డేటి వెంకట రాజ భాస్కర్, కేదారి సత్తిరాజు, ప్రధాన కార్యదర్శులుగా కురిమెల్ల రమేష్, మాలశెట్టి వేదకుమారి, బద్దే కృష్ణ, రుక్మిణి, కార్యదర్శులుగా సొందె భద్రయ్య, కరాటం భద్రయ్య, కుంజ అప్పారావు, ఆల్లిమిల్లి మహేష్, ఆకుల రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మడకం వెంకటేష్, కె.వేణు, మడకం వెంకమ్మ, మడకం మౌళి, కుంజా బుజ్జి, కుంజా శ్రీరాములు, జార్తి భిక్షం, కారం సీతారాములు, జొన్నల ఏలేశ్వరరావు, మెండెం రత్నంరాజు, ఎస్‌కే అఫ్రోజ్, బాడిస పాపారావు, మడకం వెంకటేష్, తదితరులు నియమితులయ్యారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఎంపీడీవోకు నోటీసును అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

భీమడోలు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బంటుమిల్లి కెనడీ ప్రసాద్ అన్నారు. భీమడోలులో శుక్రవారం సాయంత్రం గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ పిలుపు మేరకు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిని కలిసి తలపెట్టిన నిరసన కార్యక్రమంపై 15 రోజుల ముందస్తు నోటీసును అందజేశారు. కొన్నేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీడీవోకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు కెనడీ ప్రసాద్, తుమ్మల రత్న అంబేడ్కర్, పి.లక్ష్మీసుజన మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతల్లోను, ఆర్థిక పరమైన అంశాలను తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేసే పనుల నుంచి తమను తప్పించాలని, తమను మాతృశాఖలకు అప్పగించాలని, సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. పని వేళలు, వీడియో కాన్ఫరెన్స్, సెలవులు, పండుగుల వేళ బలవంతంగా విధులు చేయిస్తున్నారన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన నోటీసును అందించామన్నారు. ప్రభుత్వం సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా



తహసీల్దార్ దుర్గా ప్రసాద్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

నిడమర్రు: కూటమి సర్కారు ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల జయప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘం ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహసీల్దారర్ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ తక్షణం నియమించాలని, కొత్త మూల్యాంకన విధానం రద్దు చేయాలని, డీఏలు ప్రకటించాలన్నారు. అనంతరం తహసీల్దార్ దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐవీఎస్ఎస్ ప్రసాద్, ఎస్.రాము, భీమేశ్వరరావు, కె.రామకృష్ణ, కె.లలితకుమారి పాల్గొన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా రాంబాబు

గణపవరం (నిడమర్రు): ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ నూతన అధ్యక్షులుగా ఏసీహెచ్ రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి పిప్పర జెడ్పీ స్కూల్‌లో నిర్వహించిన ఎస్టీయూ మండల కమిటీ సమావేశంలో నూతన మండల స్థాయి కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా జి. ఏడుకొండలను, మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం పెద్దలు

భీమడోలు: బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులు కావాలని జిల్లా క్రాఫ్ కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం భీమడోలు, వడ్లపట్ల, ఆగడాలలంక గ్రామాల్లోని మసీదులు, హిందూ ఆలయాలు, చర్చిల్లో బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూలు సీహెచ్ చంద్రకళ, ఆర్.అమరావతి, వివిధ సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఉంగుటూరు: బాల్య వివాహాలను అరికట్టాలని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం గొల్లగూడెం గ్రామంలో ముస్లిం పెద్దలకు, ఇతరులకు అవగాహన సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రేఖ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెదవేగి: హిందీ అంతర్జాతీయ స్థాయిలో శోభిల్లుతుందని, హిందీ భాషలో రాణించడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొప్పాక హెచ్ఎం ఆర్.శైలజ అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాల్లో సెప్టెంబర్ 14 జాతీయ హిందీ భాషా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మణ్ కుమార్, రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

దెందులూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధుల నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలరోజులపాటు టీకాలు వేయడం జరుగుతుందని పశువైద్య శాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ జె .రాములయ్య దొర అన్నారు. శుక్రవారం నాగులదేవునిపాడు పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు పశువుల గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని తమ పశువులకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మూగజీవాలకు రక్షణ కల్పించాలి

ఉంగుటూరు: గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించి, మూగ జీవాలను రక్షించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ అధికారులు కూటమి నాయకులతో కలిపి క్యాంపు కార్యాలయంలో సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు జరిగే గాలికుంటు వ్యాధి మాసోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువులను అధిక మోతాదులో వాడొద్దు



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

పెదవేగి: రైతులు ఎరువులను అధిక మోతాదులో వాడకూడదని, పంటకు అవసరమైనంత మేరకే వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్త కె ఫణికుమార్ అన్నారు. పెదవేగి మండలంలోని పెదకడిమి గ్రామంలో పొలం పిలుబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త కె ఫణి కుమార్ మాట్లాడుతూ రైతులు ఎరువులను అధిక మోతాదులో వాడకూడదని, పంటకు అవసరమైనంత మేరకే వినియోగించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వినియోగిస్తే పంటల దిగుబడి మెరుగు పడటమే కాకుండా ఖర్చులు తగ్గుతాయని సూచించారు. ఏడీహెచ్ కె.సంతోష్ మాట్లాడుతూ పురుగుమందులను అధికంగా వాడటం వలన పంట నాణ్యత తగ్గుతుందని, సహజ సాగు పద్ధతులను అనుసరించడం వలన ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివ రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం నిర్మించాలని వినతి

కొయ్యలగూడెం: కనకాద్రిపురం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు శుక్రవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల వల్ల తమ గ్రామాన్ని 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగన్నగూడెం వెళ్లటం భారంగా ఉందని పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 8న గ్రామసభలో కనకాద్రిపురం గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా తీర్మానం చేయటం చట్ట విరుద్ధమని వివరించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా గ్రామ పంచాయతీని కనకాద్రిపురం నుంచి కుంతలగూడెం తరలించటం వల్ల న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో వెలగందుల ధర్మరాజు, టిక్కిన తిరుపతయ్య, దుగ్గిరాల పెద్దిరాజు, వెంకటేశ్వరరావు, నలమాటి సత్యభామ, ఎల్లిబోయిన లక్ష్మి, కామాక్షి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణలో వినూత్న ప్రయోగాలు



మెట్ట ప్రాంతంలో ఓ చేను చుట్టూ కట్టిన చీర



ఆంజనేయనగరం వద్ద నర్సరీ చుట్టూ పూర్తిగా కప్పి ఉంచిన తెరలు

- చేల చుట్టూ చీరలు, తెరలను ఏర్పాటు చేస్తున్న రైతులు
- జంతువుల నుంచి పంట రక్షణకు రైతుల తంటాలు

భీమడోలు: ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు రైతన్నలు వినూత్న ప్రయోగాలు అవలంభిస్తున్నారు. మెట్ట ప్రాంత రైతాంగం తమ పంటలను నక్కలు, ఇతర జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు పలు రకాల ప్రయత్నాలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. పంటలపై చీడపీడలు, తెగుళ్లు సోకకుండా, కళ్ల దిష్టి పడకుండా వినూత్న పద్ధతులపై దృష్టి సారిస్తున్నారు. వరి సాగుకన్నా ఉద్యానవన పంటలను సాగు చేసి అదనపు ఆదాయం సొంతం చేసుకుంటున్న రైతాంగం, ఆ పంటలను సంరక్షించుకోవడంలోను చక్కని ఆలోచనలను అలంభిస్తున్నారు. దీనికి తోడు ఆకు కూరలు, ఆకుకూరల ధరలు ఆకాశన్నండడంతో రైతులు ఉద్యానవన పంట సాగుపై ఆసక్తిని కనుబర్చుతున్నారు. అయితే రెండు సీజన్లతో పాటు ఏడాది పొడవునా మెట్ట రైతాంగం ఉద్యానవన పంటలపై నక్కలు, ఇతర జంతువులు దాడి చేసి పంటను తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. దీంతో కొంత మంది రైతులు చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వినూత్న పద్ధతులపై దృష్టి సారించారు. జంతువులు చొరబడకుండా మైకులతో శబ్దాలు చేయడం, చీడ పీడల నుంచి సంరక్షణ, విష పురుగులు, దిష్టి తగలకుండా పంటను రక్షించేందుకు పలు పద్ధతులను అవలంభిస్తున్నారు. రైతులు పంట చుట్టూ పాత చీరలు, నర్సరీల చుట్టూ తెరలు కట్టి పంటను వేయి కళ్లతో కాపలా కాస్తున్నారు.

47 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు

వరి సాగు కన్నా ఉద్యాన వన పంటలపై అధిక ఆదాయం సమకూరుతుండడంతో రైతులు ఆ పంటలపై దృష్టి సారించారు. దీంతో ప్రతి ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతుంది. భీమడోలు సబ్ డివిజన్ ఉద్యానవన శాఖ పరిధిలోని భీమడోలు 2100 ఎకరాలు, ద్వారకాతిరుమల 41 వేల ఎకరాలు, ఉంగుటూరులో 4800 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు చేస్తున్నారు. పాక్షిక మెట్ట మండలాలైన భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో అయిల్ ఫామ్, కొబ్బరి, ఖోఖో, ఆకుకూరలు, అరటి పంటలు పండిస్తున్నారు. ద్వారకాతిరుమల మండలంలో అయిల్‌పామ్, కొబ్బరి, కోకో, దొండ, బెండ, క్యాబేజీ, కాలిఫ్లవర్, చెరకు పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

అదనపు ఖర్చు

రాత్రి వేళల్లో జంతువుల బెడద నుంచి కాపాడుకునేందుకు మైక్‌లు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్నారు. దీంతో రైతులు మైకుల ఏర్పాటుకు రూ.1000 అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. రైతులు తమ పంటను కాపాడుకునేందుకు శతవిధాలుగా రైతులు ప్రయత్నాలు చేస్తూ కొంత మేర సఫలీకృతులవుతున్నారు. భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పరిధిలో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. రైతులకు సాగులో మెలకువలను అందించి వారి ఆర్థిక స్వావలంబనకు ఉద్యానవన సిబ్బంది తమ వంతు కృషి చేస్తున్నారు.